క్లుప్తంగా

జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా


ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న ఏఈ, తదితరులు

రాజాం సిటీ: మండల పరిధిలోని పొగిరి వైఎస్సార్ జగనన్న కాలనీకి అధికారుల విద్యుత్ సరఫరా ప్రారంభించారు. కాలనీలో నిర్మించిన 80 ఇళ్లకు గాను రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. వీటిని విద్యుత్‌శాఖ ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్, సర్పంచ్ పొగిరి కృష్ణవేణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పొగిరి లెనిన్, గ్రామపెద్దలు వండాన కుమారస్వామి, పొగిరి లక్షున్నాయుడు, చింత రమణ, కెల్ల వెంకటరమణ, లాభాన అప్పలనాయుడు, జేఎల్‌ఎం జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

18న వేలంపాట

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో దీపాల విక్రయానికి ఈ నెల 18న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ పి.శ్యామలరావు, ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక దీపం రూ. 5 చొప్పున విక్రయించడంతో పాటు భక్తులు సమర్పించే కొబ్బరి ముక్కల వసూళ్లకు సంబంధించి ఈ వేలం ఉంటుందని పేర్కొన్నారు. వేలంపాటకు 19-05-2023 నుంచి 18-05-2025 వరకు రెండేళ్ల కాలపరిమితి ఉంటుందన్నారు. పాటకు హాజరైన వారు ముందుగా రూ. 50 వేలను డిపాజిట్ చేయాలని సూచించారు. వేలం దక్కించుకున్నవారు పాడిన మొత్తంలో సగం డబ్బును వెంటనే చెల్లించాలని అన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రామభద్రపురం: మండల కేంద్రంలోని గిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బాదంపూడి నాగబాబు ఆధ్వర్యంలో స్వామికి రుద్రాభిషేకం, కుంకుమ పూజలు, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఆలయాన్ని సందర్శించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించి, అన్నప్రసాదం అందజేశారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'


పిల్లలతో కథల పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ సత్యవేణి

రామభద్రపురం: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. లైబ్రేరియన్ సత్యవేణి గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులతో అక్బరు, బాబరు, అబ్దుల్ కలాం జీవిత చరిత్రలతో పాటు విక్రమార్కుడు కథలు, దేశ నాయకుల చరిత్ర తెలిపే పుస్తకాలను చదివించారు. విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, తద్వారా అపారమైన జ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


వేతనదారుల మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ జగదీశ్వరరావు

తెర్లాం: వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓ జగదీశ్వరరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పని చేసిన వారికే మస్తరు వేయాలని, బోగస్ మస్తర్లు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్సా కిట్ ఉండేలా చూసుకోవాలన్నారు.

తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు

వంగర: గ్రామాల్లో తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మగ్గూరు గ్రామంలో తాగునీటి బోర్లకు చేపడుతున్న మరమ్మతులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడైన బోర్లకు క్రాస్‌ప్రోగ్రాం ద్వారా మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ప్రజల బాగోగులే సీఎం జగన్ లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు


మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రాష్ట్ర ప్రజల బాగోగులే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజాప్రభుత్వమని, ఆయన పాలనలో అందరూ బాగుండాలన్నదే ఆయన అభిమతమన్నారు. ప్రతీ ఇల్లు బాగుండాలనే తపనతోనే ఆయన అనేక సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. గడప గడపకూ అందుతున్న పథకాలతో ప్రతిఒక్కరూ ఆనందంగా ఉన్నారన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి, ఓర్వలేని లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అయితే వాటిని ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క అభివృద్ధి పని జరగాలన్నా, పథకం కావాలన్నా, ఆఖరికి రుణం మంజూరు కావాలన్నా జన్మభూమి కమిటీల కాళ్లచుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా కాదని గ్రామాల్లోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అభివృద్ధి పనులు, పథకాలు మంజూరు కావడంతో పాటు ఎన్నో ప్రజాసమస్యలు గ్రామంలోనే పరిష్కారమవుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యుడు అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, వైస్ ఎంపీపీ బెల్లాన ప్రసాద్, సర్పంచ్ కడుపుకూటి రమ్య, ఎంపీటీసీ శిష్టు లక్ష్మి, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, ఎంపీడీఓ రమామణి తదిరులు పాల్గొన్నారు.

జోరుగా ప్రచారం


గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


రాజాం: కొత్తవలసలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న హెచ్‌ఎం, తదితరులు

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రైవేట్‌కు దీటుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది సాధించిన ఉత్తీర్ణతను కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారు. మండల పరిధిలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం వినూత్న ప్రచారం నిర్వహించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల చిత్రాలతో కరపత్రాలు ముద్రించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శాసపు సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతం మెరుగుపర్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే జగనన్న విద్యాకానుక, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్, బెల్ట్, యూనిఫాం, బూట్లు, సాక్స్‌లతో పాటు మధ్యాహ్న భోజనం సదుపాయాలు విద్యార్థులకు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించండి..
రాజాం: పట్టణంలోని కొత్తవలస, మారేడుబాక గ్రామాల్లో కొత్తవలస యూపీ పాఠశాల ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఇప్పటివరకు 30 ప్రవేశాలు జరిగాయని, మరో 30 ప్రవేశాలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు హెచ్‌ఎం కుదమ తిరుమలరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


వినతులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: గ్రామ సచివాలయాలకు స్పందన ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ, వినతులను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, తహసీల్దార్ డి.ఐజాక్, మండల ఇంజినీరింగ్ అధికారి ఆనందరావు, ఈఓపీఆర్‌డీ లోపింటి త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

14 సచివాలయ భవన నిర్మాణాలు పూర్తి


చిన్నశిర్లాంలో ప్రారంభానికి సిద్ధంగా సచివాలయ భవనం

రేగిడి: మండలంలో 14 గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయ్యాయని ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావు, పంచాయతీరాజ్ జేఈ వి.రామకృష్ణ తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో 25 గ్రామ సచివాలయాలు ఉండగా 14 చోట్ల సొంత భవనాలుండగా.. ఉణుకూరు, రేగిడి గ్రామ సచివాలయాలు మినహా మిగిలిన తొమ్మిది చోట్ల నిర్మాణాలు త్వరితగతిన జరుగుతున్నట్లు తెలిపారు. పూర్తయిన భవనాలను త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు.

'జగనన్నకు చెబుదాం'పై శిక్షణ


శిక్షణకు హాజరైన సచివాలయ సిబ్బంది, అధికారులు

సంతకవిటి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్. రఘునాథాచారి అధ్యక్షతన సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్ధిదారుకి వ్యక్తిగతంగా సంక్షేమ పథకాలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులున్నా టోల్ ఫ్రీ నంబర్ 1902కు కాల్ చేయాలని, కాల్ చేసిన వెంటనే వైఎస్ఆర్ ఐడి వస్తుందని తెలిపారు. సమస్య పరిష్కారమయ్యేవరకు ఎస్ఎంఎస్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తారన్నారు. తహసీల్దార్ ఎ.సులోచనారాణి, ఏపీఓ త్రినాథ్, ఏపీఎం టి.సీతారాం, ఈఓపీఆర్‌డీ బి.రాంబాబు, హౌసింగ్ ఏఈ కనకయ్య, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'నాడు - నేడు' పనులు వేగవంతం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న 'నాడు - నేడు' పనులను వేగవంతం చేయాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లను పెంచాలని సూచించారు.

గృహనిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకరరావు

రాజాం:

జగనన్న ఇళ్ల లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేసేలా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి శనివారం హౌసింగ్ డే కార్యక్రమం నిర్వహించి, లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. అనంతరం 'నాడు - నేడు' పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ వేణుగోపాలనాయుడు, పీఆర్‌జేఈ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కుళాయిలు వేయండి


ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావుకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసి

రేగిడి: మండల పరిధిలోని గుళ్లపాడు పంచాయతీకి అనుబంధంగా ఉన్న కొండల మామిడివలస గ్రామ దళిత కాలనీలో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ జి. కాశీవిశ్వనాథరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్‌కు ఎంపీడీఓ ఆదేశించారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, వండానపేట, ఆమదాలవలస, తదితర గ్రామాల్లో తాగునీటి బోర్లకు సోమవారం మరమ్మతులు చేశారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు తెలిపారు. తాగునీటి బోర్లు పాడైతే మండల పరిషత్ కార్యాలయానికి గాని సచివాలయానికి గాని సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇంతవరకు మండలంలో 11 గ్రామ పంచాయతీల్లో 28 తాగునీటి బోర్లు బాగుచేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌పై అవగాహన


విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలు చదివిస్తున్న ఉపాధ్యాయులు

తెర్లాం: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌పై సోమవారం అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.పార్వతి, జి.రామకృష్ణనాయుడు ఆంగ్ల పదాలు ఏ విధంగా పలకాలి, ఏ విధంగా చదవాలి, ఇంగ్లిష్ ఎలా మాట్లాడాలన్న విషయాలను తెలియజేశారు.

బాల్య వివాహాలకు ఒప్పుకోవద్దు..


వండానపేటలో అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు

రేగిడి: బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని మహిళా పోలీసులు కిశోర బాలికలకు సూచించారు. మండలంలోని బూరాడ, ఉణుకూరు, రేగిడి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలకు, కిశోర బాలికలకు సోమవారం సఖి మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులు మాట్లాడుతూ, గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కిశోర బాలికలు బాల్య వివాహాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ఇతరులకు అవగాహన కల్పించాలని అన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురంలో మద్యం బాటిళ్లను తరలిస్తున్న అమనాన చంద్రమౌళిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై బి. లోకేశ్వరరావు తెలిపారు. అంబకండి గ్రామానికి చెందిన నిందితుడు 18 మద్యం సీసాలతో పట్టుబడ్డాడని చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

గడువులోగా 'స్పందన' సమస్యలు పరిష్కరించాలి


రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రమామణి


తెర్లాం: సూచనలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ


బొబ్బిలి: మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

రామభద్రపురం: గడువులోగా స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ రమామణి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన(జగనన్నకు చెబుదాం) కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పలువురు సమర్పించిన అర్జీలను పరిశీలించి, వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్య ఏదైనా కారణంతో పరిష్కారం కాకపోతే అర్జీదారునికి తెలియజేయాలన్నారు. ఒకే సమస్య పరిష్కారానికి ప్రజలు మళ్లీ మళ్లీ ప్రభుత్వ కార్యాలయాలకు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామలింగేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 1902 టోల్ ఫ్రీ నంబర్‌పై గ్రామ స్థాయిలోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ నంబర్‌ను సంప్రదిస్తే నేరుగా సీఎంఓ దృష్టికి ప్రజల సమస్యలు తెలుస్తాయని తెలియజేయాలన్నారు. అంతకుముందు పలువురు పలు సమస్యల పరిష్కారానికి సమర్పించిన అర్జీలను పరిశీలించి, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతీ సోమవారం జరిగే ఈ స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా హాజరు కావాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పరిష్కరించాలని సూచించారు. ప్రాధాన్యతా క్రమంలో నిర్ణీత గడువులోగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. స్పందించిన సంబంధిత అధికారులు ఇటీవల 500 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇళ్లు ప్రారంభించిన వారితో నిర్మాణాలను వేగవంతం చేయించాలని, ఇంకా ప్రారంభించని వారితో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ బీఎండీ ప్రసాదరావు, ఆర్‌ఓ ప్రసాదరావు, టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం-విశాఖ బస్సు సర్వీస్ పునరుద్ధరణ

తెర్లాం: తెర్లాం-విశాఖపట్నం ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించారు. ఇకనుంచి ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు బస్సు సర్వీసులు ఉంటాయి. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల చొరవతో ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు సదరు ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌కు తెర్లాం వాసులు, పరిసర గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. తెర్లాం మండల కేంద్రం నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు గతంలో ఎస్.కోట ఆర్టీసీ డిపోకి చెందిన బస్సు ఉండేది. కరోనా సమయంలో ఆ బస్సు సర్వీసును సంబంధిత అధికారులు రద్దు చేశారు. దీంతో తెర్లాంతో పాటు ఆ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు విశాఖపట్నం వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడేవారు. బొబ్బిలి గానీ, రాజాం గానీ వెళ్లి, అక్కడి నుంచి విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. ఇదే విషయాన్ని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు నర్సుపల్లి యశోద, గ్రామస్తులు కలిసి ఎమ్మెల్యే శంబంగి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఇదే విషయాన్ని జెడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి, బస్సు సర్వీసు పునరుద్ధించేలా కృషి చేశారు.

నేడు సిరిమానోత్సవం

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామంలో జరుగుతున్న గ్రామదేవతల(దేశమ్మ, మెట్టమ్మ, బంగారమ్మ) ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సిరిమానోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు సిరిమాను ఊరేగింపు ప్రారంభమవుతుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామని సర్పంచ్ బొమ్మి విశాలాక్షి తెలిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించి, ఆయా అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

అదనపు ఫీజు వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

బొబ్బిలి: నిబంధనలకు విరుద్ధంగా అదనపు ఫీజు వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు బలివాడ గౌరీశంకర్‌ను సోమవారం కలిసి, వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 వేలు నుంచి 4 వేల వరకు అదనంగా ఫీజు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఫీజుల విధానం కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు పాటించడం లేదన్నారు. పుస్తకాలు, యూనిఫాం, ఇతర విద్యాసామగ్రి వారి వద్దే కొనుగోలు చేయాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు.

సేంద్రియ బెల్లం కొనుగోలు చేయాలి


బెల్లం దిమ్మలతో రైతులు

విజయనగరం అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ముందుగా ఇచ్చిన హామీ మేరకు సేంద్రియ చెరకు బెల్లం దిమ్మలను కొనుగోలు చేయాలని బొబ్బిలి మండలం కోమటపల్లి, బాడంగి మండలం ముగడ గ్రామ రైతులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మిని విజయనగరంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, జిల్లా వ్యవసాయ సాధికార సంస్థల అధికారులు గ్రామానికి వచ్చి సేంద్రియ ఎరువులతో పండించిన చెరకు బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానం వారు కొనుగోలు చేస్తారని చెప్పడంతో సాగు చేశామని చెప్పారు. వారు నిర్దేశించిన పరిణామాల్లో బెల్లం దిమ్మలు తయారుచేశామని, అయితే ఆరు మాసాలు పూర్తయిన ఇప్పటికీ కొనుగోలుకు టీటీడీ వారు రాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు

రేగిడి: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై వాట్సాప్‌లలో అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండల వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు పార్టీ నాయకులతో కలిసి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని సరసనాపల్లికి చెందిన పంతల హరి ముఖ్యమంత్రిపై అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నాడని, వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై శ్రీనివాసరావును కోరారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్

రాజాం: నగరంలోని జీఎంఆర్ఐటీలో ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 219 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 209 మంది.. మధ్యాహ్నం 219 మంది విద్యార్థులకు 213 మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.